'ఆటో బంధు' ఇచ్చి ఆదుకోవాలి

- ప్రభుత్వానికి ఆటో యూనియన్ నాయకుల వినతి
- పలు గ్రామాల్లో నిరసనలు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ సభ్యులు

రాయికల్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో, జీపు డ్రైవర్లకు ప్రతి నెలా రూ.20వేల ఆటో బంధు ఇచ్చి ఆదుకోవాలని జగిత్యాల డీజిల్ ఆటో సంక్షేమ సంఘం అధ్యక్షుడు శెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాయికల్ పట్టణంలో రాయికల్ ఆటో, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడపై మూడు రోజుల పాటు నిరసన ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు పథకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆటో, జీపు, టాటా మ్యాజిక్ నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారికి ఫ్రీ బస్సు పథకం ద్వారా ఉపాధి లేకుండా పోయి రోడ్డునపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆటో, జీపు డ్రైవర్లను, ప్రభుత్వం ఆదుకొని, ఉపాధి మార్గాలు చూపించడంతోపాటు, ప్రతి నెలా జీవన భృతి కింద రూ. 20 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జగిత్యాల నుంచి జైత్రయాత్రను ప్రారంభించి, హైదరాబాద్‌లోని ప్రజా దర్బార్, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తమను విస్మరిస్తే రానున్న స్థానిక సంస్థలు, లోక్ సభ ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. మొదటి రోజు చేపట్టిన ఆటో డ్రైవర్ల సాత్విక ప్రదర్శనకు సీపీఐ నాయకుడు సుతారి రాములు, ఆదివాసీ, ఉడుం దెబ్బ నాయకుడు ఆత్రం ఆనంద్ సంఘీభావాన్ని తెలిపారు. ఇక్కడ ఆటో డీజిల్ సంఘం జగిత్యాల జనరల్ సెక్రటరీ ఆర్ముల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు సామల్ల ప్రసాద్, నాయకులు ఎండీ మహబూబ్, నగేశ్, రమేశ్, లక్ష్మణ్ ఉన్నారు.

బీర్‌పూర్‌లో ధర్నా

సారంగాపూర్, డిసెంబర్16: బీర్‌పూర్ మండల కేంద్రంలో శనివారం ఆటో, టాక్సీ, జీప్ డ్రైవర్లు తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశ పెట్టడంతో ఉపాధిని కొల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం తహసీల్ కార్యలయంలో తహసీల్దార్ నరేశ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసింహ ఆటో, జీప్, టాక్సీ యూనియన్ ప్రెసిడెంట్ తిరుమల రాజేందర్, వైస్ ప్రెసిడెంట్ దండిగ కొమురయ్య, సభ్యులు ఆడెపు మల్లేశం, పొన్నం శ్రీను, పోల్సాన్ మీనారావు, వెయ్య భాస్కర్, పల్లికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో ..

కొడిమ్యాల, డిసెంబర్ 16 : మండల కేంద్రంలో శనివారం మహాలక్ష్మి పథకంపై ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు పర్ల పెల్లి జలేందర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నట్లు చెప్పారు. ఆటో పైనాన్స్ కట్టలేని స్థితిలో ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. జీవన భృతి కల్పించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ నుంచి అంగడి బజార్, పోలీస్ స్టేషన్ మీదుగా తహసీల్ కార్యాలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పర్లపెల్లి ప్రభుదాస్, సాధిక్, స్వామి తదితరులు పాల్గొనగా బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు.

సారంగాపూర్: బీర్‌పూర్ తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

డీఎంకు వినతి

కోరుట్ల రూరల్, డిసెంబర్ 16 : యూసుఫ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సు నడపాలంటూ సర్పంచ్ తుకారాంగౌడ్ డీఎం విజయమాధరికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్లేందుకే బస్సు వస్తుందని కానీ తిరిగి గ్రామానికి తీసుకరావడం లేదన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరారు. చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ పంచరి విజయ్ కుమార్ గ్రామానికి విద్యార్థులను తీసుకెళ్లి తిరిగి తీసుకరావడానికి బస్సు రావడం లేదని వెంటనే బస్సును పునరుద్ధరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

మేడిపల్లి, డిసెంబర్ 16 : భీమారం మండలం మన్నెగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన యాత్రకు హైదరాబాద్ వెళ్లారు. చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, నెహ్రూ జులాజికల్ పార్క్‌ను దర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం శిరీష, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

రాయికల్, డిసెంబర్ 16 : రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు, యూత్ నాయకులు ప్రభుత్వ దవాఖానలో గర్భిణులు, రోగులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఇక్కడ యూత్ నాయకులు చైతన్య, చింటూ, మనోజ్, శేఖర్, వంశీ, అమీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

జగిత్యాల, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో విద్య, ఉద్యోగావకాశాలపై శనివారం అవగాహన కల్పించారు. బేటీ బచావో–బేటీ పడావో, మహిళా చట్టాలు, సాధికారికతపై జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ అశ్విని, జిల్లా మిషన్ కోఆర్డినేటర్, గౌతమి, హేమశ్రీ వివరించారు. కరెస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపాల్, డైరెక్టర్ గాలిపెల్లి ఈశ్వర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబర్ 16: హరిహర క్షేత్రమైన ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువైంది. ధనుర్మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన దేవాలయమైన లక్షీనరసింహస్వామివారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని అల్లుబండ వద్ద భక్తితో అల్లు పట్టుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

నర్సన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు

ధనుర్మాసం సందర్భంగా ప్రధాన దేవాలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో వేకువజామున 3 గంటలకు దేవాలయం తెరచి 4 నుంచి 5.30 గంటల వరకు అభిషేకాది పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేకంగా తిరుప్పావై ప్రబంధం నిర్వహించి, పొంగలి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల: భూమాచారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సుంకె రవిశంకర్

కొడిమ్యాల, డిసెంబర్ 16 : డబ్బుతిమ్మాయిపల్లి కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు మేడిచల్మాల భూమాచారి రోడ్డు ప్రమాదంలో, హిమ్మత్‌రావుపేటకు చెందిన సామల్ల రాజేశం ఇటీవల మరణించారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఇక్కడ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నమనేని వేణుగోపాల్‌రావు, విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు ఎండీ అక్బర్, రామ్‌సాగర్, హిమ్మత్ రావుపేట గ్రామాల అధ్యక్షులు నీలగిరి విద్యాసాగర్‌రావు, ఆకునూరి మల్లయ్య, అనిల్ తదితరులున్నారు.

ముత్యంపేటలో..

మల్యాల, డిసెంబర్ 16 : ముత్యంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వొల్లాల నవీన్‌గౌడ్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. నవీన్ మృతికి గల కారణాలను తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సుభాన్, సర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు అజయ్‌రెడ్డి, ముల్క మల్లయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు రామన్నపేట విద్యార్థిని

మల్యాల, డిసెంబర్ 16 : రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ అథ్లెటిక్స్ క్రీడాపోటీలకు రామన్నపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సంకుర్తి శ్రీలత ఎంపికైనట్లు హెచ్ఎం గడ్డం రాజగోవిందరెడ్డి, పీఈటీ విద్యాసాగర్ శనివారం తెలిపారు. శుక్రవారం పెద్దపల్లిలో నిర్వహించిన అండర్–14 ఎస్జీఎఫ్ క్రీడా పోటీలో శ్రీలత ఖోఖోలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 20న ఆసిఫాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననుందన్నారు. శ్రీలతను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మల్యాల, డిసెంబర్ 16 : ముత్యంపేటకు చెందిన వొల్లాల నవీన్ గౌడ్(30) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల ఎస్ఐలు తీగల అశోక్, కందుకూరి కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ నెల 3న ముత్యంపేటలోని తన ఇంటి వద్ద రాత్రి 9 గంటలకు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు జగిత్యాలలోని దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించాలని సూచించారు. కరీంనగర్‌లోని ఓ దవాఖానలో 13 రోజుల పాటూ చికిత్స పొంది పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో మరణించాడు. మృతుడి భార్య వొల్లాల దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రేచపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన

సారంగాపూర్, డిసెంబర్16: రేచపల్లిలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ హెల్ప్‌లైన్ నంబర్1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్, ట్రాఫిక్ రూల్స్‌పై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మోహినొద్దీన్, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 16 : మండల కేంద్రంతో పాటు వర్షకొండ, ఎర్రండి సబ్ స్టేషన్‌కు వచ్చే 33కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరుకుతున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు

మేడిపల్లి, డిసెంబర్ 16 : ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు వస్తుందని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమీద్ పేర్కొన్నారు. కట్లకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు మారు, చంద్రప్రకాశ్, అశోక్, రాజేంద్రప్రసాద్, జగదీశ్వర్‌రావు బదిలీపై వెళ్లగా శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించి, శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయుడు శ్రీపాద వెంకట్రాములు రాసిన పాటకు విద్యార్థినులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. హెచ్ఎంలు హానుమాన్‌సాగర్, జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్, గోపీకృష్ణ, ఇమాం, రవికుమార్, సంతోష్, రాజయ్య, వైకుంఠం, దేవయ్య, ప్రవీణ్, రాజగోపాల్, చందు, రాజశేఖర్ ఉన్నారు.

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

మారుతీనగర్, డిసెంబర్, 16 : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని హెచ్ఎం సీహెచ్ నరసింహమూర్తి పేర్కొన్నారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని చావిడి వద్ద గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు ఉన్నత ఫలితాల సాధనకు తల్లిదండ్రులు ఇంటి వద్ద వారిపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. సమావేశంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Date: 16-12-2023

It is hereby informed that the open place and one Shop Nos 4-2-13 to 15, located at Beetbazar, Vani nagar, Jagtial proper and dist. The boundaries of are cited are East: High Way West: P. Suresh Kumar North: P. Suresh Kumar South: Shakapuram Roja. The properties are joint and ancestral properties of Armulla Narsaiah S/o late Sailu, Armulla Gangaram S/o late Sailu, Armulla Rajesham (Died) S/o late Sailu, Armulla Gangadhar S/o late Sailu, succeeded them. Armulla Rajesham (Died) his daughter Shakapuram Roja.

That the above property shop No. 4-2-13 to 15, one of the share holder Armulla Gangadhar S/o late Sailu and his all brothers also agreed to sale Gangadhar share to Thandra Venugopal & Party s/o Narayana, age: 65 years, occ: Rtd employee, R/o Adhilabad proper and dist.

The above property is belongs to my client is one of the share holder Armulla Gangadhar S/o late Sailu, age: 48 years, occ: Fish Business, R/o Beetbazar, Vani nagar, Jagtial proper and dist, it is informing anybody is having any objections, any loans, any transactions or other things on above cited property they can reach us 7 days on their concerns.

Sd/- **P. VENKATESHWAR RAO,**
Advocate
H.No. 4-2-119/2/f, Thulasi Nagar, Jagtial. Cell: 9848141661